క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నేతకు పరామర్శ



అశోక్‌ను పరామర్శిస్తున్న మాల మహానాడు రాష్ట్ర నేత గంటా పండు

దెందులూరు: రోడ్డు ప్రమాదంలో తలకు కాలికి గాయాలైన ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు వైఎస్సార్ సీపీ నేత అశోక్‌ను ఆదివారం వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, ఏలూరు జెడ్పీటీసీ మండల సరస్వతి కొండల రావు, మాల మహానాడు రాష్ట్ర నేత గంట పండు పరామర్శించారు. ప్రమాద సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. తలకు మూడు కుట్లు వేశారని కాలుకు తీవ్ర గాయమైందని అశోక్ వారికి తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో త్వరతగతిన కోలుకోవాలని గంట పండు అన్నారు.

జూనియర్ లెక్చరర్స్ సంఘ అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



బీవీ శ్రీనివాస్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర కమిటీ అసోసియేట్ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన బెజగం వెంకట శ్రీనివాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను సంఘ జిల్లా నాయకులు ఏలూరులో విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆదివారం తిరుపతిలోని ఆఫీసర్స్, సోషల్ అండ్ కల్చరల్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారని, జిల్లాలోని నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌ఛార్జ్ ప్రిన్స్‌పాల్‌గా, జంతుశాస్త్ర అధ్యాపకునిగా పని చేస్తున్న బీవీ శ్రీనివాస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ అధ్యాపకులు అభినందించారు.

నేటి నుంచి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

దెందులూరు: పశువుల్లో గాలికుంటు వ్యాధుల నివారణకు ప్రభుత్వ ఆదేశాల మేరకు నెలరోజులపాటు పశువులకు టీకాలు వేస్తామని చాటపర్రు పశువైద్యాధికారి డాక్టర్ దివ్య అన్నారు. ఆదివారం చాటపర్రు పశువైద్యశాలలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15 వరకు అన్ని గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అన్ని గ్రామాల్లో పశువైద్య సిబ్బంది ఇళ్లకు వెళ్లి పశువులకు టీకాలు వేస్తామన్నారు. పశు వైద్య శాఖ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో సమాచారాన్ని అందించాలన్నారు.

విద్యుత్ అధికారుల అవినీతి దందా

- అక్రమ వసూళ్లకు తెరలేపిన అధికారులు
- వినియోగదారుడి ఫిర్యాదుతో వెలుగులోకి
- ఫిర్యాదు అందినా చర్యలు నిల్



అశోక్ నగర్ విద్యుత్ సబ్ స్టేషన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో విద్యుత్ అధికారులు అవినీతి దందా కొనసాగిస్తున్నారు. అమాయకులైన వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని వారిని బెదిరింపులకు గురి చేసి లక్షల్లో వసూలు చేస్తున్నారు. కొత్త సర్వీసుకు దరఖాస్తు చేసుకుంటే మీటరు బిగించడానికి వేలల్లో వసూలు చేస్తున్నారు. ఇంటిలో విద్యుత్ సమస్య ఏమైనా వచ్చి ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు ఫిర్యాదు చేస్తే పరిష్కరించడానికి వచ్చిన లైన్‌మెన్లు కనీసం రూ. 500 ఇస్తే గానీ కదలడం లేదు. ఇక విద్యుత్ వైర్లు తమ ఇంటి మీదుగా వెళుతున్నాయని ఫిర్యాదు చేస్తే అవి తొలగించడానికి అయ్యే ఖర్చు వినియోగదారుడే భరించాలని ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. కొత్తగా అపార్ట్‌మెంట్ ప్రారంభిస్తే దానికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి లక్షల్లోనే వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ వారి ధన దాహం తీరడం లేదు. అక్రమంగా వచ్చే డబ్బు సరిపోక ఇప్పుడు కొత్త దందాకు తెరలేపారు.

అక్రమ వసూళ్లు ఇలా

నగరంలోని ఈపీడీసీఎల్ నార్త్ సెక్షన్‌లో పని చేస్తున్న ఒక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నార్త్ లైన్‌మెన్ ఇద్దరూ కలిసి అక్రమ వసూళ్లకు తెరలేపారు. ఈ సెక్షన్ పరిధిలోని గృహాలకు వెళ్లివారి గృహాలకు ఎక్కువ మీటర్లు ఉన్నాయి, పవర్ లోడ్ ఎక్కువ ఉంటోంది కాబట్టి వారు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకోవాలని నోటీసులు ఇస్తున్నారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ పెట్టడానికి ఇదమిత్థంగా ఎంత అవుతుందో? నోటీసులో పేర్కొనకుండా రూ. 5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకూ చెల్లించాల్సి ఉంటుందని లైన్‌మెన్ చెబుతున్నారు. దాంతో ఆందోళనకు గురైన వినియోగదారులు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వద్దకు వెళ్లి బతిమాలుకుంటే రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకూ తమకు ఇస్తే వారి జోలికి రాకుండా మేనేజ్ చేస్తానని చెప్పి వసూలు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఇలా సుమారు 30 మంది వినియోగదారుల నుంచి వసూలు చేసినట్టు తెలుస్తోంది.

వినియోగదారుడి ఫిర్యాదుతో..

ఇలాగే నార్త్ సెక్షన్ పరిధిలోని ఒక వినియోగదారుడికి లైన్‌మెన్ నోటీసు ఇవ్వడంతో అతను హతాసుడై అసలు ఎక్కువ మీటర్లు ఉంటే ఇలా నోటీసులు వచ్చే నిబంధన ఏమైనా ఉందా? అని ఆరా తీస్తే అలాంటి నిబంధన ఏమీ లేదని తెలుసుకున్నాడు. వెంటనే విశాఖపట్నంలోని తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయంలోని సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ అక్రమ దందాలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజ్ కుమార్, లైన్‌మెన్ ఆర్. సూర్య నారాయణ పాలుపంచుకుంటున్నారని ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొన్నాడు. ఇప్పటి వరకూ నోటీసులు ఇచ్చిన ఏ ఒక్క వినియోగదారునికీ ట్రాన్స్‌ఫార్మర్ బిగించలేదని, నోటీసులు ఇచ్చిన వినియోగదారులకు కనీసం ఎస్టిమేషన్ వేసిన కాపీలు ఇవ్వలేదని తెలుసుకున్నాడు. అలాగే సంబంధిత వినియోగదారుడి నుంచి సంస్థకు ఒక్క రూపాయి కూడా కట్టించలేదని తాను ఇచ్చిన ఫిర్యాదులో అధికారుల దృష్టికి తీసుకువెళ్లాడు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇలా ఎక్కువ మీటర్లు ఉండి అధిక విద్యుత్ వినియోగించే వినియోగదారులను విచారించాలని సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్‌కు ఆదేశాలు జారీ చేయాల్సి ఉండగా అలాంటిదేమీ చేయకుండా నేరుగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరే రంగంలోకి దిగి వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

చర్యలకు మీనమేషాలు

ఈ విషయంపై సదరు వినియోగదారుడు గత జూన్ 24న సంస్థ సీఎండీకి ఫిర్యాదు చేయగా ఈ ఫిర్యాదుపై విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకోవాలని సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్‌కు పంపారు. చీఫ్ జనరల్ మేనేజర్ సుమన్ కళ్యాణి దేవర జూలై 30వ తేదీన ఇదే ఫిర్యాదుపై తదుపరి చర్యలు తీసుకోవడానికి విచారణ చేసి వివరణాత్మక నివేదిక ఇవ్వాలని ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ సాల్మన్ రాజుకు బదిలీ చేశారు. ఈ ఫిర్యాదును ఆయన ఏలూరు ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు గత ఆగష్టు 22న బదిలీ చేసి దీనిపై విచారణ చేసి వివరణాత్మక నివేదికను వారం రోజుల్లో సమర్పించాలని ఆదేశించారు. దీనిపై ఇప్పటి వరకూ తదుపరి విచారణ చేపట్టకుండా అధికారులు అవినీతి అధికారికి కొమ్ము కాస్తున్నారని, సదరు అవినీతి అధికారిపై చర్యలు తీసుకునే వరకూ పోరాటం చేస్తానని ఫిర్యాదు దారుడు స్పష్టం చేస్తున్నారు. దీనిపై వివరణ కోసం ఏలూరు ఆపరేషన్ ఎస్ఈని ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

ముగిసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు



జేపీని సత్కరిస్తున్న ఫ్రెండ్స్ సర్కిల్ కమిటీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక 35వ డివిజన్ గానుగుల పేట వీధిలో గణపతి నవరాత్రులు ముగింపును పురస్కరించుకుని ఫ్రెండ్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్ళపల్లి జయప్రకాష్ (జేపీ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం కమిటీ ప్రతినిధులు జేపీని దుశ్శాలువాతో సత్కరించి స్వామి వారి ప్రసాదం అందచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు గుడిదేసి శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్ బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవులు, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కొల్లిపాక సురేష్ బాబు, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి భోగాది ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

17న విశ్వకర్మ జయంతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): శ్రీ విశ్వకర్మ భగవానుని యజ్ఞ మహోత్సవాలను ఈ నెల 17వ తేదీన నగరంలో నిర్వహించనున్నట్టు విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సింహాద్రి బృంగాచార్యులు, మానేపల్లి నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలో ఈ ఉత్సవాలను గత 27 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 17న స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఉదయం 9 గంటలకు విశ్వకర్మ పతాకావిష్కరణతో కార్యక్రమాలు ప్రారంభమౌతాయని, ఈ కార్యక్రమాల్లో గణపతి పూజ, విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం స్వామి వారి అన్నప్రసాద వితరణ కార్యక్రమం సాయంత్రం 4 గంటల నుంచి స్వామి వారి ఊరేగింపు నగర వీధుల్లో అంగరంగ వైభవంగా నిర్వబహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమాల్లో విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా గంగానమ్మ జాతర

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక తంగెళ్ళమూడి 28వ డివిజన్ సీతారామ నగర్ చెరువుగటు పై ఉన్న శ్రీ గంగానమ్మ వారి జాతర మహోత్సవాలు ఆదివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొని పిండి వంటలతో, అరటిపండ్లు, కొబ్బరికాయలు, పూలు, పసుపు, కుంకుమలతో ఆలయానికి వచ్చి మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సిద్ధాంతి పొట్నూరి దుర్గేష్ ఆచార్య విచ్చేసిన భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ముందుగా మంగళ వాయిద్యాలతో మేళ తాళాలతో ఆలయ వ్యవస్థాపకులు రేఖల చిన్నారావు గృహం నుంచి పోతురాజు బాబు(ఘన చారి) అమ్మవారికి చీర సారెతో, 108 మంది మహిళ భక్తులు తమ ఇంటి నుంచి తీసుకువచ్చిన కలశాలతో అమ్మవారికి పోతురాజు బాబుకు స్నాన సంబరాలు చేయించి వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని, పోతురాజుని ఆలయాన్ని సుందరంగా అలంకరణ చేయడం త్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ జాతర కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, కార్పొరేటర్ తంగిరాల అరుణ సురేష్ బాబు పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త గురించి తెలుసుకోవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను చదవాలని సామాజిక వేత్త సయ్యద్ సలీం అన్నారు. ప్రవక్త మహమ్మద్ జన్మించిన మాసం సందర్భంగా మానవ మహోపకారి మొహమ్మద్ జీవితం అనే అంశంపై జమాతే ఇస్లామీ హింద్ సంస్థ ఆధ్వర్యంలో నగరంలో ఏర్పాటు చేసిన గెట్ టు గెదర్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సయ్యద్ సలీం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్లాం ధర్మం ప్రపంచ మానవాళికి కారుణ్య మార్గం చూపుతుందని, ప్రవక్త తన చిట్టచివరి ప్రసంగంలో దైవం నుంచి వచ్చిన ఆదేశాలు ప్రజలకు తెలపడంతో పాటు ఆచరించి చూపారన్నారు. 23 ఏళ్ల వ్యవధిలో అంధకారంలో ఉన్న అరబ్ ప్రజలను అన్ని రంగాల్లో తీర్చిదిద్ది ప్రళయం వచ్చే వరకు చెప్పుకునే విధంగా నిలిపారన్నారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ ఏలూరు నగర అధ్యక్షులు నయీముల్లా, సభ్యులు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	38	బీక్షచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	36
బెండకాయలు	20	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	48	కంద	00
కాకర కాయలు	36	బీట్‌రూట్	38
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	38	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	26	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	35
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	20
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	29
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	22
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	25
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

చినుకుపడితే చెరువే



నీట మునిగిన ఏలూరు వెంకట్రామా థియేటర్ రోడ్డు

ఏలూరులో చిన్నపాటి వర్షానికే నగరంలోని ప్రధాన కూడళ్లు, మెయిన్ రోడ్లు, వర్షపునీటితో మునిగిపోయి చెరువును తలపిస్తున్నాయి. ప్రజలకు బయటకు రావాలంటే మోకాలు లోతు నీటిలో నడవాల్సిందే. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి నగరంలోని ప్రధాన రహదారులు ఇదిగో ఇలా మారాయి.

– ఫొటోలు, సాక్షి ఫొటో గ్రాఫర్, ఏలూరు



చెరువును తలపిస్తున్న జీజీహెచ్ మెయిన్ రోడ్డు



పవర్‌పేట స్టేషన్ సెంటర్ వద్ద ఇలా



వర్షానికి మునిగిపోయిన పత్తేబాద రైతు బజార్



నీట మునిగిన ఏలూరు పవర్ పేట రోడ్డు



వర్షం నీటితో మునిగిపోయిన స్నేహ వారధి